నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 1-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 124 | పేజీలు:4 | వెల: రూ.1/-

శ్రీనగర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. శ్రీనగర్ సమీపంలో ఉగ్రవాదులున్నారనే సమాచారంతో రాత్రి స్థానిక పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా పొద్దుపోయిన తర్వాత గాలింపు బృందాలపై ముష్కరులు కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు టెర్రరిస్టులు హతమయ్యారని కశ్మీర్ ఎఉఖ విజయ్ కుమార్ తెలిపారు. వారిలో ఒకరిని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన సుహైల్ అహ్మద్ రాథర్‌గా గుర్తించామన్నారు. రెండు రోజుల వ్యవధిలో జమ్ముకశ్మీర్‌లో తొమ్మిది మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. అయితే ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో యుద్ధ సామాగ్రి, ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఆపదలో ఉన్న బాలల రక్షణ కోసమే బాల రక్షక్ : మంత్రి తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 31:ఆపదలో ఉన్న బాలల రక్షణ కోసమే బాల రక్షక్ వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద హైదరాబాద్ జిల్లాకు మంజూరైన రెండు బాల రక్షక్ వాహనాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కలెక్టర్ శర్మన్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం 1098 హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసి, జిల్లాకు ఒకటి చొప్పున సీఎస్ఆర్ నిధులతో బాలరక్షక్ వాహనాలను కేటాయించిందని చెప్పారు. హైదరాబాద్ జిల్లాకు రెండు వాహనాలను కేటాయించగా, అవి ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

అనాథ బాలలు, భిక్షాటన చేస్తూ 18 సంవత్సరాల్లోపు పిల్లలు ఎక్కడ కనిపించినా, బాల్య వివాహం జరుగుతున్నా కానీ 1098 హెల్ప్ లైన్ కు కాల్ చేయాలని కోరారు. హెల్ప్ లైన్ కు కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి ప్రొటెక్షన్ ఆఫీసర్, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ అధికారులు బాలరక్షక్ వాహనంతో చేరుకొని వారిని రక్షించి, బాల సదనంకు చేర్చి వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ వివరించారు. పరిస్థితులను బట్టి పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారుల సహకారం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో బాల రక్షక్ వాహనాలు నిర్వహించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సుమలత, సికింద్రాబాద్ సీడీపీఓ సునంద, ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొవిడ్ టాబ్లెట్స్.. ఫస్ట్ హైదరాబాద్‌లోనే రిలీజ్..

హైదరాబాద్, డిసెంబర్ 31:కరోనా మహమ్మారిని అయిదు రోజుల్లో కట్టడి చేసే సామర్థ్యం ఉన్న మెడిసిన్‌గా చెప్పుకుంటున్న మోల్నుపిరావిర్ ఇండియాలో ముందుగా హైదరాబాద్ మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇటీవల ఈ యాంటీ వైరల్ డ్రగ్‌కు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) పర్మిషన్ ఇచ్చింది. ఇండియాలో ఈ ట్యాబెట్లు తయారు చేసేందుకు 13 కంపెనీలు అనుమతి తీసుకోగా అందులో ఆరు ఫార్మా కంపెనీలు హైదరాబాద్‌కి చెందినవే కావడం గమనార్హం.

మోల్నుపిరావిర్‌ని ఇండియాలో అందించేందుకు అనుమతి పొందిన 13 కంపెనీల్లో ఒకటైన ఆప్టిమన్ సంస్థ మోల్‌కోవిర్ పేరుతో ట్యాబ్లెట్లు తయారు చేసింది. వీటిని హైదరాబాద్ మార్కెట్‌లో రిలీజ్ చేసింది. జనవరి 3 నుంచి మిగిలిన సిటీస్‌లో క్రమంగా పంపిణీ చేస్తామని ప్రకటించింది. కాగా, మెల్నుపిరావిర్‌ని రేపోమాపో మార్కెట్‌లోకి తెచ్చేందుకు మిగిలిన కంపెనీలు కూడా వర్క్ స్పీడప్ చేస్తున్నాయి. ఒమిక్రాన్ వ్యాప్తి కలవరపెడుతుంటే మరోవైపు థర్డ్ వేవ్ భయాలు దేశాన్ని కమ్మేస్తున్నాయి. ఈ టైమ్‌లో కరోనాకి విరుగుడుగా మోల్నుపిరావిర్ టాబ్లెట్స్ అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లో వాసులు హ్యాపీగా ఫీలవుతున్నారు.

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కలిసిన బీజేపీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 31:తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీపై రాష్ట్ర బీజేపీ చీఫ్ బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తో ఈ రోజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, టీచర్ల సమస్యలు, 317 జీవో పునఃసమీక్షపై గవర్నర్‌తో బండి సంజయ్ బృందం చర్చించింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చినప్పుడే ఉద్యోగ కేటాయింపులు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని, 41 నెలలు ఏమి చేయకుండా ఇప్పుడు అగమాగం కేటాయింపు లు చేస్తున్నారని మండిపడ్డారు.

గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ తో భేటీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్, బీజేపీ శాసనసభాపక్ష నేత రాజాసింగ్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రఘు నందన్ రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు నల్లు ఇంద్రసేనారెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, టీఎస్ పీఎస్సీ మాజీ సభ్యులు సీహెచ్.విఠల్, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్, బంగారు శృతి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి లు ఉన్నారు.

బీభత్సం సృష్టిస్తున్న మంచు తుఫాను.. తీవ్ర ఇబ్బందుల్లో అమెరికన్లు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:వాతావరణ మార్పుల ప్రభావం అమెరికాపై స్పష్టంగా కనిపించింది. ఈ ఏడాది అగ్రరాజ్యంపై ప్రకృతి విపత్తులు విరుచుకుపడ్డాయి. మొన్నటి అకాల వర్షాలు, కార్చిచ్చుల నుంచి ఇప్పటి మంచు ఉత్పాతం దాకా అమెరికా ప్రతికూల పరిస్థితుల మధ్య మనుగడ కొనసాగిస్తున్నది. ప్రస్తుతం అక్కడ హిమపాతం ప్రమాదకరంగా మారింది. ఓవైపు వర్షాలు, ఇంకొకవైపు మంచు అనేక రాష్ట్రాల్లో జనజీవనాన్ని స్తంభింప జేసింది. ఆరుబయట ఆరు అడుగుల మందాన దట్టమైన మంచు దుప్పట్లు పరుచుకున్నాయి. ఉత్తర కాలిఫోర్నియాలోని సియెర్రా, నెవాడాలో దాదాపు 492 సెం.మీ. మంచు కురిసింది. 1970 నాటి 456 సెం.మీ. రికార్డును బ్రేక్ చేసింది. గత 24 గంటల్లోనే 99 సెం.మీ మంచు కురిసిందంటే శీతల వాతావరణం ఎంత సంక్లిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా డిసెంబర్ మాసంలో అక్కడ హిమపాతం 508 సెం.మీ దాటింది. ట్రాఫిక్ దాదాపుగా స్తంభిం చింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

రోడ్లపై మంచుగడ్డలను తొలగించే పనులు కొనసాగుతున్నప్పటికీ, నిరంతరం మంచు కురుస్తుండటం వల్ల ఆ ప్రయత్నాలు పెద్దగా ప్రభావం చూపడం లేదు. మంచు తుపానుల నుంచి ఉపశ మన, రెస్క్యూ చర్యలను ప్రభుత్వం కొనసా గిస్తు న్నది. ఆర్కిటిక్ మంచు కారణంగా సియాటెల్, వాషింగ్టన్ నగరాలు 50 ఏళ్లలో అత్యంత శీతల వాతావరణాన్ని ఎదుర్కొం టున్నాయి. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ ఏడు డిగ్రీలకు పడిపోయింది. అనేక ప్రాంతాలను మంచు కవచం కమ్మేసింది. ప్రస్తుతం నీటి వనరుల సమస్యను తగ్గించింది. భవిష్యత్‌లో కరవు మళ్లి ఉద్భవించవచ్చు అని పశ్చిమ రీజియన్ వాతావరణ కేంద్ర శాస్త్రవేత్త డాన్ మెక్‌వోయ్ అన్నారు.

మెట్రోతో మెరుగైన రవాణా.. త్వరలోనే మరో కొత్త స్కీం తెస్తాం: ఎన్‌వీఎస్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31:మెట్రో రైల్‌తో నగర వాసులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నామని, ప్రయాణికుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోందని మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. అయితే కరోనా నష్టాల నుంచి కోలుకోవడానికి త్వరలో స్కీంలు ప్రవేశపెడతామని చెప్పారు. సువర్ణ ఆఫర్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో సువర్ణ ఆఫర్ రెండో నెల లక్కీ డ్రా జరిగింది. ఐదుగురు విజేతలకు స్మార్ట్ టీవీ, వాషింగ్ మిషన్, స్మార్ట్‌ఫోన్, మైక్రో ఓవెన్‌ను అందించారు. మెట్రోలో ప్రయాణం వల్ల సమయం ఆదా అవుతుందని, మహిళలు సురక్షితంగా ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. కరోనాతో నష్టాలతో ఉన్న మెట్రోను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఎల్‌అండ్‌టీ మెట్రోతో కలిసి కొత్త స్కీమ్స్ ప్లాన్ చేస్తోందన్నారు.

అన్‌లాక్ తర్వాత మెట్రో రైలులో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం రోజూ 2 లక్షల 40వేల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యను ఇంకా పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాపిడో సంస్థతో టై అప్ అయ్యామని, మెట్రో ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా బైక్ ట్యాక్సీ సర్వీసులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మెట్రో రైళ్లలో మరింతగా కోవిడ్ సేఫ్టీ మెజర్స్‌ను అమలు చేస్తామన్నారు. ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ, మాస్కు ఉంటేనే ప్రయాణికులకు మెట్రోలో ప్రయాణం కోసం అనుమతి ఇస్తున్నామని చెప్పారు. రైళ్లను శానిటైజ్ చేస్తున్నామని, ఫిజికల్ డిస్టెన్స్ పాటించాలని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సూచిస్తున్నామని తెలిపారు.

పోయినేడు కంటే ఈసారి నేరాలు పెరిగినయ్: డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31:గత ఏడాదితో పోలిస్తే తెలంగాణలో ఈసారి నేరాలు పెరిగాయని డీజీపీ మహేందర్ రెడ్డి వెల్లడించారు. 4.6 శాతం మేర నేరాలు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. ఇవాళ 'వార్షిక నేర నివేదిక 2021'ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నేరాల్లో నిందితులకు శిక్షపడిన కేసులు 50.3 శాతమని చెప్పారు. 80 కేసుల్లో 126 మందికి జీవిత ఖైదు పడిందని తెలిపారు.

మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఉండాలన్న ప్రభుత్వ సూచనలను సమర్థంగా అమలు చేశామన్నారు. ఇప్పటిదాకా 98 మంది నక్సలైట్లను అరెస్ట్ చేశామని, మరో 133 మంది లొంగిపోయారని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రంలో ఎక్కడా మత ఘర్షణలు జరగలేదని, ఒక్క నిర్మల్ జిల్లా భైంసాలోనే చిన్న గొడవలు జరిగాయని ఆయన వెల్లడించారు.

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు సోషల్ మీడియా ద్వారా చేరువయ్యామని డీజీపీ మహేందర్ రెడ్డి చెప్పారు. డయల్ 100కు ఈ ఏడాది 11.24 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్ సిటీలో ఫిర్యాదు వచ్చిన ఐదు నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారన్నారు. పేద, ధనిక తేడా లేకుండా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారి కోసం 800 స్టేషన్లలో రిసెప్షన్లను ఏర్పాటు చేశామన్నారు. షీ టీమ్స్ కు 5,145 ఫిర్యాదులు వచ్చాయని, బాధితులకు భరోసా కల్పించాయని తెలిపారు. హాక్ ఐ ద్వారా 83 వేలకు పైగా కేసులు నమోదు చేశామన్నారు.

కేసులు పెట్టినా తరచూ నేరాలకు పాల్పడుతున్న 664 మందిపై పీడీ యాక్ట్ పెట్టామన్నారు డీజీపీ. రాష్ట్ర వ్యాప్తంగా 8.5 లక్షల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇక, ఈ ఏడాది 8,828 సైబర్ నేరాలు నమోదైనట్టు డీజీపీ చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 6,690 మంది చనిపోయారన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై రూ.879 కోట్ల జరిమానా వేశామని డీజీపీ వెల్లడించారు.

మహా పుణ్యక్షేత్రంలా బల్కంపేట ఎల్లమ్మ ఆలయం : మంత్రి తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 31:మహా పుణ్యక్షేత్రంను తలపించేలా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయ వద్ద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద 4.48 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న మల్టి లెవెల్ పార్కింగ్, షాపింగ్ కాంప్లెక్స్ పనులను నియోజకవర్గ అభివృద్ధి నిధులు 6 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న బోర్ వెల్ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? ఎంతో మహిమ కలిగిన బల్కంపేట ఎల్లమ్మ దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వాహనాలను నిలిపేందుకు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్ స్తంభిస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జీ ప్లస్ త్రీ విధానంలో 1165 గజాల విస్తీర్ణంలో పార్కింగ్, షాపింగ్ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 200 టూ వీలర్ లు, 40 ఫోర్ వీలర్ వాహనాలు పార్కింగ్ చేసే విధంగా డిజైన్ చేసినట్లు వివరించారు. అంతేకాకుండా మొదటి, రెండో అంతస్థుల్లో 24 షాప్స్, ఒక డార్మెటరీ ఈ కాంప్లెక్స్ లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 8 నెలల్లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. అదే విధంగా ప్రస్తుతం ఆలయం ముందు వివిధ వ్యాపారం నిర్వహించుకుంటున్న వారికి కేటాయించేందుకు పక్కనే ఉన్న ఆలయానికి చెందిన కాంప్లెక్స్ ముందు షాప్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ నగరానికి సెంటర్ లో ఉన్న ఎల్లమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వారంలో మూడు రోజులు అత్యధికంగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని, భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా అమ్మవారి కల్యాణాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగస్వాములయ్యేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. దాతల సహకారంతో బంగారు చీరను చేయించి అమ్మవారికి అలంకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఎస్ఈ మల్లికార్జున్, ఆలయ ఈఓ అన్నపూర్ణ, కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 2న ప్రధానమంత్రి మీరట్ సందర్శన

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022 జనవరి 2న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1:00 గంటకు ఆయన మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. మీరట్‌లోని సర్ధానా పట్టణ పరిధిలోగల సలావా, కైలి గ్రామాలలో రమారమి రూ.700 కోట్ల వ్యయంతో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతుంది. ప్రధాని ప్రముఖంగా దృష్టి సారించిన రంగాలలో క్రీడా సంస్కృతిని ప్రోదిచేయడం, దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటు కూడా భాగంగా ఉన్నాయి. మీరట్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా విశ్వవిద్యాలయం నిర్మాణం ప్రధాని దార్శనికతను సాకారం చేసే కృషిలో కీలకమైన ముందడుగు కానుంది.

ఈ క్రీడా విశ్వవిద్యాలయంలో సింథటిక్ హాకీ మైదానం, ఫుట్‌బాల్ మైదానం, బాస్కెట్‌బాల్/వాలీబాల్/హ్యాండ్‌బాల్/కబడ్డీ మైదానాలు, లాన్ టెన్నిస్ కోర్టు, జిమ్నాసియం హాల్, సింథటిక్ రన్నింగ్ స్టేడియం, ఈతకొలను, బహుళ ప్రయోజన మందిరంతోపాటు సైక్లింగ్ వెలోడ్రోమ్ వంటి ఆధునిక వసతులు, అత్యాధునిక క్రీడా మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అంతేకాకుండా షూటింగ్, స్క్వాష్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, కెనోయింగ్-కయాకింగ్ తదితర సౌకర్యాలు కూడా క్రీడాకారులకు అందుబాటులో ఉంటాయి. ఈ విశ్వవిద్యాలయంలో పురుష/ మహిళా క్రీడాకారులు 540 మంది వంతున మొత్తం 1080 మంది ఏకకాలంలో శిక్షణ పొందే వీలుంటుంది.

చరిత్రలో నేటినిజం



కుటుంబాలు కావాలి శాంతి సామరస్యాలకు నెలవులు

(01 జనవరి 'గ్లోబల్ ఫ్యామిలీ డే' సందర్భంగా)

ప్రపంచ సమాజంలో కుటుంబం ఒక యూనిట్‌గా గుర్తించబడుతున్నది. కుటుంబం లేని వ్యక్తులు ఉండరు. కుటుంబ వాతావరణమే బాలల ఎదుగుదలకు దోహదపడుతుంది. కుటుంబ సభ్యుల మధ్య 'షేరింగ్ అండ్ కేరింగ్' భావనలు కలిగితే అనుబంధాల పువ్వులు వికసిస్తాయి, విచారాలు తొలగి పోయి ఆనంద పరిమళ జల్లులు వెదజల్లబడతాయి. ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ కుటుంబాలు, స్వలింగ భాగస్వామ్య కుటుంబాలు లాంటి పలు రకాల కుటుంబాలు కనిపిస్తున్నాయి. కుటుంబం రక్తసంబంధాల సమ్మేళనం, ప్రేమానుబంధాల కోవెల, పిల్లలకు స్వర్గధామం, స్వేచ్ఛకు తావు, బాధలకు లేపనం, సంతోషాల నెలవు, అనువంశికతకు ఆదరువు, చిరునవ్వుల గుడి, ఆది గురువులు కొలువైన తావు. కుటుంబాలు విచ్ఛిన్నమైన సమాజంలో అశాంతి మబ్బులు కమ్ముకుంటాయి. కుటుంబ అభివృద్ధితోనే ప్రపంచాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. విశ్వవ్యాప్తంగా విస్తరించి ఉన్న మానవ సమాజంలో కుటుంబాలే ముఖ్య యూనిట్లుగా పరిగణించ బడుతున్నాయి. కుటుంబాల్లో పరస్పర సహకారం, పంచుకోవడం, సంరక్షణ, ప్రేమ, బేషరతు సహకార ధోరణి, నమ్మకాల నిధి, విధేయత, మానవీయ విలువలు, ఆప్యాయతలు, సానుకూల దృక్పథం, త్యాగాలు, అనుబంధాలతో వర్ధిల్లినంత కాలం సమాజంలో శాంతి సామరస్యాలు విస్తరించడం జరిగి సుఖసంతోషాల కోవెలలుగా నిలబడాయి.

క్రీస్తుశకం 117-138 రోమన్ కాలంలో హాడ్రిన్ ప్రవేశ పెట్టిన 'శాంతి (పీస్)' అనబడే భావనకు 3వ శతాబ్దంలో బహుళ ప్రచారం జరిగింది. 1945లో 2వ ప్రపంచ యుద్ధం నేర్పిన గుణపాఠాలతో ప్రపంచ శాంతి స్థాపనకు వేదికగా ప్రపంచ దేశాలు 'ఐక్యరాజ్యసమితి (ఐరాస)'ని ప్రారంభించారు. 1960ల్లో 'జోహన్ గాల్టుంగ్' ప్రవేశపెట్టిన 'పాజిటివ్ పీస్' భావనతో పాటు 1996లోఅమెరికన్ మేధావి 'లిండా గ్రోవర్' రచించిన బాలల పుస్తకం 'వన్ డే ఇన్ పీస్- జనవరి 01, 2000(ఒక రోజు శాంతిగా- జనవరి 01, 2000)' ఆధారంగా ప్రతి ఏట 'గ్లోబల్ ఫ్యామిలీ డే' లేదా 'వరల్డ్ పీస్ డే'గా పాటిస్తున్నారు. 1997లో ఐరాస 'అంతర్జాతీయ ప్రపంచ బాలల సాంస్కృతిక శాంతి, అహింస దశాబ్దం' పాటించాలనే ఆలోచనలు చేసింది. దీనిలో భాగంగా 1999లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం 01 జనవరి 2001ల నుండి ప్రతి ఏట 'గ్లోబల్ ఫ్యామిలీ డే' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవాళి మధ్య సామరస్యం, శాంతియుత సహజీవనం, ఏకత్వ సాధనకు కుటుంబ సభ్యుల శారీరక మానసిక ఆరోగ్యాలు దోహదపడతాయి. ప్రపంచ కుటుంబాల సంక్షేమంతో వసుదైక కుటుంబం (గ్లోబల్ విలేజ్) సుసాధ్యం అవుతుంది.

సమాజంలోని కుటుంబాల ఆలోచనలు కలిసినపుడు, సమాజాభివృద్ధి, గ్రామాభివృద్ధి, జిల్లాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి, ప్రపంచాభివృద్ధి సుసాధ్యం అవుతుందని గమనించాలి. వేగవంతమైన ఆధునిక జీవన విధానంలో కుటుంబ సభ్యులు కలిసి కొంత సమయం గడపడం కష్టంగా తోస్తున్నది. కనీసం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అయినా కుటుంబాలు కలిసి రోజంతా గడపడం (వన్ డే ఆఫ్ పీస్ అండ్ కేరింగ్), అభివృద్ధి పథకాలు రచించుకోవడం, నూతన తీర్మానాలు చేసుకొని వ్యక్తిగత, కుటుంబ, సమాజాభివృద్ధికి, శాంతి స్థాపనకు కృషి చేయాలి. కొత్త సంవత్సరం, కొత్త ఆశలు, కొత్త తీర్మానాలు, కొత్త లక్ష్యాలు, కొత్త ఆలోచనలు చేస్తూ ప్రతి ఏడాది ప్రగతి పథంలో నడవడానికి స్వచ్ఛందంగా ప్రతినబూనాలి. కుటుంబ సభ్యుల మధ్య జ్ఞాన వినిమయం, ఆలోచనలు పంచుకోవడం, మంచి చెడుల అవగాహన, పరస్పర సహకారం, సమస్యలను కలిసికట్టుగా ఏదుర్కోవడం లాంటివి అలవాటుగా చేసుకోవాలి. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఒక్కటే ఉంటుంది. కుటుంబాన్ని స్వర్గంగా లేదా నరకంగా మార్చుకోవడం మన చేతుల్లోనే ఉందని నమ్మాలి. కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు తాత్కాలికం, పరిష్కార యోగ్యమని నమ్మాలి. ఒకే జీవితం, ఒకే కుటుంబం, ఒకే అమ్మానాన్న ఉన్న సమాజంలో మనందరం భాగస్వామ్యం కలిగి ఉన్నాం. మన కుటుంబాలను ఆనందమయ స్వర్గధామాలుగా మార్చుకుంటూ, ప్రపంచ శాంతి, సమాజాభివృద్ధికి దోహదపడదాం. వసుధైక కుటుంబ భావనను జీర్ణించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిందాల్ పవర్ లిమిటెడ్‌లో 96.42 శాతం ఈక్విటీ వాటాను కొనుగోలు చేయడానికి సీసీఐ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:జిందాల్ పవర్ లిమిటెడ్‌లో 96.42 శాతం ఈక్విటీ వాటాను వరల్డ్‌వన్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేయడానికి సీసీఐ ఆమోదం తెలిపింది. వరల్డ్‌వన్ ప్రైవేట్ లిమిటెడ్ (వరల్డ్‌వన్) సంస్థ లిస్టెడ్ మరియు అన్‌లిస్టెడ్ కంపెనీలలో పెట్టుబడులను కలిగి ఉన్న పెట్టుబడి హోల్డింగ్ కంపెనీ. జిందాల్ పవర్ లిమిటెడ్ (జేపీఎల్) ప్రధానంగా బొగ్గును ఇంధన వనరుగా ఉపయోగించి థర్మల్ పవర్ విద్యుత్తును ఉత్పత్తి చేసే వ్యాపారంలో నిమగ్నమై ఉంది. ప్రతిపాదిత కలయిక జేపీఎల్‌లో వరల్డ్‌వన్ ద్వారా 96.42% ఈక్విటీ వాటాను కొనుగోలు చేయడానికి సంబంధించినది. దీనికి సంబంధించి ప్రభావిత మార్కెట్లు.. (తి) భారతదేశంలో బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ఉత్పత్తికి మార్కెట్లు (తితి) భారతదేశంలో విద్యుత్ ప్రసారణ మార్కెట్లు. ఈ వాటా కొనుగోలుకు సంబంధించిన సవివరణ ఆర్డర్ వెలువడనుంది.

తన కలల సంస్థను ఏర్పాటుచేసేందుకు శ్వేతా హరీష్ కు ప్రత్యేక మూలధన పరపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:తన కలల సంస్థ అయిన అనుగ్రహ ఇంటీరియర్ సొల్యూషన్స్ ను శ్వేతా హరీష్ బెంగళూరులో ప్రారంభించారు. ప్రత్యేక మూలధన పరపతితో లంకె కలిగిన రాయితీ పథకం కింద ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ ఆమెకు తోడ్పాటును అందించింది. పెరుగుతున్న మార్కెట్ డిమాండ్ శ్వేత హరీష్ తన సహోద్యోగులతో కలిసి పాఠశాలలు, కార్పొరేట్ కార్యాలయాలు, గృహాల కోసం మాడ్యులార్ ఫర్నిచర్‌ను తయారుచేసేందుకు ప్రేరేపించింది. ఉద్యం (యుడిమైఎఎం)కింద నమోదుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ దినపత్రికలో ఇచ్చిన ప్రకటన ఆమె దృష్టిని ఆకర్షించి, ఆమెకు మార్గాన్ని సూచించింది. ఎంఎస్ఎంఇ మద్దతు వారు స్వయంసమృద్ధం కావడానికి శక్తినిచ్చింది.

సంజయ్ కుమార్ సింగ్ ఉక్కుమంత్రిత్వశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:శ్రీ సంజయ్ కుమార్ సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. శ్రీ పి.కె. త్రిపాఠి, సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డిఓపిటి) తర్వాత శ్రీసింగ్ బాధ్యతలు చేపట్టారు. శ్రీ త్రిపాఠి ఉక్కు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీ సంజయ్ కుమార్ సింగ్‌ను ఉక్కు కార్యదర్శిగా సోమవారం కేంద్రం అమలు చేసిన ప్రధాన ఉన్నత స్థాయి బ్యూరోక్రాటిక్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా నియమించారు.

ప్రస్తుత పదవిని చేపట్టడానికి ముందు శ్రీ సంజయ్ కుమార్ సింగ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ ఉ పబ్లిక్ గ్రీవెన్స్ డిపార్ట్‌మెంట్ (డిఎఆర్‌పిజి) మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెన్షన్స్ ఉ పెన్షనర్స్ వెల్ఫేర్ (డిఓపిపిడబ్లు) కార్యదర్శిగా ఉన్నారు.

రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో బడ్జెట్ ముందస్తు సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:కేంద్ర బడ్జెట్ 2022-23 కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు (శాసనసభ కలిగిన) ఆర్థిక మంత్రులతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశానికి గురువారం కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు.

ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి, ముఖ్యమంత్రులు, డిప్యూటీ ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, మంత్రులు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు (శాసనసభ కలిగిన), కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

సంప్రదింపుల సమావేశానికి హాజరైన వారికి స్వాగతం పలుకుతూ, ఈ సమావేశ ప్రాముఖ్యతను కేంద్ర ఆర్థిక కార్యదర్శి వివరించారు. మహమ్మారి విజృంభించిన నెలల్లోరాష్ట్రాలకు మళ్ళీ మళ్ళీ రుణాలను అందిస్తూ, మూల ధన వ్యయానికి ప్రత్యేక తోడ్పాటును అందించి, రుణపరిమితులను పెంచడం ద్వారా తమ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక తోడ్పాటును అందించినందుకు అనేకమంది సమావేశంలో పాలుపంచుకున్న అనేకులు కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ ఉపన్యాసంలో జోడించేందుకు కేంద్ర ఆర్థికమంత్రికి భాగస్వాములు అనేక సూచనలు చేశారు. కేంద్ర బడ్జెట్ 2022-23 కోసం విలువైన సూచనలు, ఇన్‌పుట్లు ఇచ్చినందుకు పాల్గొన్నవారికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి ఒక్క ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు.

ఆడియో కాన్ఫరెన్సింగ్/ ఆడియోటెక్స్/ వాయిస్ మెయిల్ సర్వీసెస్ కోసం లైసెన్సింగ్ ఫ్రేమ్‌వర్క్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:టెలికాం రంగంలో అమలు చేస్తున్న సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం అమలు అమలు జరుగుతున్న"వాయిస్ మెయిల్ సర్వీస్ (విఎంఎస్),ఆడియోటెక్స్ (ఏటీఎస్),యూనిఫైడ్ మెసేజింగ్ సర్వీసెస్ (యుఎంఎస్)' స్టాండ్ ఎలోన్ లైసెన్స్ విధానంలో సవరణలు మార్పులు చేస్తూ "యూనిఫైడ్ లైసెన్స్ ఫర్ ఆడియో కాన్ఫరెన్సింగ్/ ఆడియోటెక్స్/ వాయిస్ మెయిల్ సేవల లైసెన్సింగ్ ఫ్రేమ్‌వర్క్" ను జారీ చేసింది. 16.07.2001 నాటి ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం టెలికాం శాఖ విఎంఎస్,ఆడియోటెక్స్,యుఎంఎస్ లకు స్టాండ్ ఎలోన్ లైసెన్సులు జారీ చేస్తోంది.

"ఆడియో కాన్ఫరెన్సింగ్/ఆడియోటెక్స్/వాయిస్ మెయిల్ సర్వీసెస్ కోసం లైసెన్సింగ్ ఫ్రేమ్‌వర్క్"పై ట్రాయ్ నుంచి అందిన సిఫార్సులను పరిశీలించిన టెలికాం శాఖ ఈ లైసెన్సులను యూనిఫైడ్ లైసెన్స్ (యూఎల్)లో భాగంగా చేస్తూ ఈ అధికారానికి కొత్త అధ్యాయాన్ని చేర్చింది. అయితే, ప్రస్తుత లైసెన్స్ నుంచి యూనిఫైడ్ లైసెన్స్ లో మారే అంశంలో ప్రస్తుతం విఎంఎస్,ఆడియోటెక్స్,యుఎంఎస్ లైసెన్సులను కలిగి ఉన్నవారికి స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. 16.07.2001న జారీ చేయబడిన టెలికాం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా విఎంఎస్,ఆడియోటెక్స్,యుఎంఎస్ లకు కొత్తగా స్టాండ్ ఎలోన్ లైసెన్స్ జారీ చేయడం గాని వాటి పునరుద్ధరణ గాని చేయబడదు.

జల్ జీవన్ మిషన్ కింద మధ్యప్రదేశ్‌కు రూ.15,381.72 కోట్ల తాగునీటి సరఫరా పథకాలు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:మధ్యప్రదేశ్ రాష్ట్రం లో జల్ జీవన్ మిషన్ కింద రూ.15,381.72 కోట్ల తాగునీటి సరఫరా పథకాలకు -రాష్ట్ర స్థాయి పథకం మంజూరు కమిటీ (ఎన్ ఎల్ ఎన్ ఎన్ సి) సమావేశంలో-ఆమోదం లభించింది.1.09 కోట్లకు పైగా గ్రామీణ జనాభాకు కుళాయి నీటి కనెక్షన్ అందించడానికి 22 బహుళ గ్రామాల పథకాలను మంజూరు చేశారు. ఈ 22 పథకాలు రేవా, సాత్నా, సెహోర్, సిధి, అలీరాజ్ పూర్, బద్వానీ, జబల్ పూర్, పన్నా, మాండ్ల, సాగర్, కట్నీ, ధర్, షియోపూర్, ఉమరియా , ఖర్గోన్ జిల్లాల్లోని 9,240 గ్రామాలకు ప్రయోజనం చేకూరుస్తాయి. 2023 నాటికి అన్ని గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి సరఫరాను అందించాలని రాష్ట్రం యోచిస్తున్న సమయం లో ఈ పథకాల ఆమోదం ప్రాముఖ్యత ను సంతరించుకుంది. ఈ గ్రామాలన్నీ వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. కొత్త పథకాల వల్ల ఈ 9,240 గ్రామాల్లో నివసిస్తున్న 22 లక్షలకు పైగా కుటుంబాలకు వచ్చే 30-40 సంవత్సరాలపాటు క్రమం తప్పకుండా తగినంత స్వచ్ఛమైన కుళాయి నీటి సరఫరా లభిస్తుందని భావిస్తున్నారు

జల్ జీవన్ మిషన్ (జెజెఎం) కింద, గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి సరఫరా ను అందించడానికి చేపట్టాల్సిన పథకాల పరిశీలన ,ఆమోదం కోసం రాష్ట్ర స్థాయి పథకం మంజూరు కమిటీ (ఎస్ ఎల్ ఎస్ సి) ల ఏర్పాటుకు అవకాశం ఉంది. నీటి సరఫరా పథకాలు/ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకోవడానికి ఎస్ ఎల్ ఎస్ సి రాష్ట్ర స్థాయి కమిటీగా వ్యవహరిస్తుంది, భారత ప్రభుత్వ జాతీయ జల్ జీవన్ మిషన్ (ఎన్ జెజెఎం) నామినీ ఒకరు ఈ కమిటీలో సభ్యుడు గా ఉంటారు.

2021-22లో రాష్ట్రానికి రూ.5,117 కోట్లు కేటాయించగా, అందులో 'హర్ ఘర్ జల్' కార్యక్రమం అమలు కోసం ఇప్పటికే మధ్యప్రదేశ్ కు రూ.2,558 కోట్లు విడుదల చేశారు. ఇది సుదూర నీటి వనరుల నుండి నీటిని తీసుకురావడానికి ప్రతిరోజూ గంటలు గడిపే మహిళలు , పిల్లలు ఎదుర్కొంటున్న శ్రమను చాలా తగ్గిస్తుంది.

2019 ఆగస్టు 15న జల్ జీవన్ మిషన్ ప్రారంభించే సమయంలో రాష్ట్రంలో కేవలం 13.53 లక్షల (11%) గ్రామీణ గృహాలకు మాత్రమే కుళాయి నీటి సరఫరా ఉంది. గత 28 నెలల్లో, కోవిడ్-19 మహమ్మారి , లాక్ డౌన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రాష్ట్రం 31.63 లక్షల (25.8%) కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లను అందించింది. ఇప్పటి వరకు, రాష్ట్రంలోని 1.22 కోట్ల గ్రామీణ గృహాల్లో, 45.16 లక్షల (36.93%) ఇళ్లలో కుళాయి నీటి సరఫరా లభ్యమవుతోంది. 2021-22లో 22.1 లక్షల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లను అందించాలని రాష్ట్రం ప్రణాళిక రూపొందించింది.

అందించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత ను సాకారం చేయడానికి 2021-22 లో మధ్య ప్రదేశ్ కు రూ.2,558.39 కోట్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్ ను మిషన్ విడుదల చేసింది. ఈ ఏడాది కేంద్ర మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్ రూ.5,116.79 కోట్లు కేటాయించారు, ఇది గత ఏడాది కేటాయింపు కంటే నాలుగు రెట్లు ఎక్కువ. కేంద్ర జలవనరుల శక్తి మంత్రి నాలుగు రెట్ల గ్రాంట్ పెంపు ను అమోదిస్తూ, 2023 డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ గృహానికి కుళాయి నీటి సరఫరా నుకల్పించడానికి రాష్ట్రానికి పూర్తి సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఎన్ జె జెఎం బృందం పథకాల సత్వర అమలు, పనుల నాణ్యత, సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యం అవసరాన్ని నొక్కి చెప్పారు. జల్ జీవన్ మిషన్ లో చాలా ముఖ్యమైన భాగం అయిన గ్రే. వాటర్ నిర్వహణ ను నీటి సరఫరా పథకాలలో ఏకీకృతం ద్వారా చేర్చాలని రాష్ట్రానికి సూచించారు.

దేశంలోని పాఠశాలలు, ఆశ్రమాలు ,అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు సురక్షితమైన కుళాయి నీటిని అందించడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రకటించిన 100 రోజుల ప్రచారాన్ని కేంద్ర మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్ 2020 అక్టోబర్ 2న ప్రారంభించారు.

అభ్యసన కేంద్రాల్లో అందించే కుళాయి నీటిని పిల్లలు ,ఉపాధ్యాయులు తాగడానికి మధ్యాహ్న భోజనం వండడానికి, చేతులు కడుక్కోవడానికి , టాయిలెట్ లలో నూ ఉపయోగిస్తారు. మధ్యప్రదేశ్ లోని 68,811 పాఠశాలలు (73%) ,40,357 అంగన్ వాడీ కేంద్రాలకు (60%) వారి ఆవరణలో కుళాయి నీటి సరఫరా కల్పించారు. మిగిలిన పాఠశాలలు , ఎడబ్ల్యుసిలలో కుళాయి నీటి సరఫరాను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని రాష్ట్రాన్ని కోరారు.

'సబ్ కసాత్, సబ్ కావికాస్, సబ్ కా విశ్వాస్ సబ్ కా ప్రయాస్'కు అనుగుణంగా పనిచేస్తూ, 'ఎవరూ వదిలివేయబడలేదు' అనేది జల్ జీవన్ మిషన్ ఆశయం గా ఉంది. ఇంకా ఇది త్రాగునీటి సరఫరాకు సార్వత్రిక ప్రాప్యతను లక్ష్యంగా పెట్టుకుంది. 2019 లో మిషన్ ప్రారంభంలో, దేశంలోని మొత్తం 19.20 కోట్ల గ్రామీణ గృహాలలో, కేవలం 3.23 కోట్ల (17%) మాత్రమే కుళాయి నీటి సరఫరాను కలిగి ఉన్నాయి. గత 28 నెలల్లో, కోవిడ్-19 మహమ్మారి ,లాక్ డౌన్ ల అంతరాయాలు ఉన్నప్పటికీ, జల్ జీవన్ మిషన్ వేగంతో అమలు జరిగింది. నేడు, 5.50 కోట్ల గ్రామీణ కుటుంబాలు కుళాయి నీటి కనెక్షన్లు కలిగి ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8.74 కోట్ల (45.5%) గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి సరఫరా ఉంది. గోవా, తెలంగాణ, హర్యానా రాష్ట్రాలు, అండమాన్ -నికోబార్ దీవులు, పుదుచ్చేరి, డి అండ్ ఎన్ హెచ్ , డి అండ్ డి కేంద్ర పాలిత ప్రాంతాల లోని 100% గృహ కుళాయి కనెక్షన్ లు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం 84 జిల్లాలు, 1.30 లక్షలకు పైగా గ్రామాల లోని ప్రతి ఇంటికి కుళాయి నీటి సరఫరా లభిస్తోంది.

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ గా డా.పార్థసారథి నియామకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:కేంద్ర ప్రభుత్వం, రక్షణ శాఖ, ఉత్పత్తుల విభాగం కింద పనిచేసే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీలో ఇండిపెండెంట్ డైరెక్టర్ గా డా.పార్థసారథిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. దీనిపై భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ డా. పార్థసారథికి ఉత్తరం రాశారు. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తరపున ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ గా మీ నియామకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మీ సలహాలు, సూచనలతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

నియామకంపై డా. పార్థసారథి స్పందిస్తూ తన పై నమ్మకం ఉంచి ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి, హోంమంత్రి అమిత్ షా కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు కి, రాష్ట్ర ఇన్ ఛార్జిలు మురళీధరన్, సునీల్ దేవధర్ కు, జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి కి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ కి, సత్య కుమార్ కు, జీవీఎల్ నరసింహారావు కు, కన్నా లక్ష్మీనారాయణ కు, మధుకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలో అత్యంత నిబద్ధతతో పని చేస్తానన్నారు. భారత దేశీయ రక్షణరంగ ఉత్పత్తులను తయారు చేయడంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ చేస్తున్న విశేష కృషి లో తాను కూడా భాగస్వామి అవుతానన్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేస్తున్నానన్నారు. దేశ రక్షణ రంగానికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఎంపి రామిరెడ్డిని కలిసిన మద్య విమోచన కమిటీ చైర్మన్

అమరావతి, డిసెంబర్ 31:రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డిని శుక్రవారం పెదకాకానిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, శర్వాణి రెడీ మిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పరిచిన మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర స్థాయిలో మద్యం దుష్ఫలితాలపై ప్రజలను జాగృతలను చేయడానికి విశిష్ట కృషి చేస్తుందని తెలుపుతూ చైర్మన్ లక్ష్మణరెడ్డికి అభినందనలు తెలిపారు. పెదకాకాని మండలంలో కళాజాత ద్వారా మత్తు పానీయాల పై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. లక్ష్మణరెడ్డి తన స్వగ్రామమైన కారుమంచి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి చేస్తున్న కృషిని కొనియాడారు. కారుమంచి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని లక్ష్మణరెడ్డికి తెలిపారు.

మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 31:రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పర్ పల్లిలో శంకర్ పల్లి మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, మాజీ మార్కెట్ చైర్మన్ స్వర్గీయ సి.మల్లారెడ్డి కుటుంబ సభ్యులను సబితా ఇంద్రారెడ్డి స్వర్గీయ సి.మల్లారెడ్డి ఇటీవలే మృతి విద్యా శాఖ మంత్రి పరామర్శించారు. కుమారుడు శివరాం రెడ్డి చెందడంతో మంత్రి సబితా రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లారెడ్డి సతీమణి, శంకర్ పల్లి మాజీ ఎంపీపీ దమయంతి మల్లారెడ్డిని పరామర్శించారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత శాఖలలో ఎలక్ట్రోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:'ఎలక్ట్రోరల్ బాండ్ పథకం-2018'ను భారత ప్రభుత్వం 2018 జనవరి 02వ తేదీ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 20 ద్వారా నోటిఫై చేసింది. పథకం యొక్క నిబంధనల ప్రకారం ఎలక్ట్రోరల్ బాండ్‌లను భారతదేశ పౌరుడు లేదా భారత దేశంలో విలీనం చేయబడిన లేదా వ్యవస్థీకృతమైన వారు (గెజిట్ నోటిఫికేషన్‌లోని ఐటెమ్ నంబర్ 2 (డి)లో నిర్వచించినట్లు) ఎవరైన కొనుగోలు చేయవచ్చు. ఎలక్ట్రోరల్ బాండ్లను వ్యక్తిగతంగాను లేదా ఇతర వ్యక్తులతో కలిసి కొనుగోలు చేయవచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 (43 ఆఫ్ 1951) లోని సెక్షన్ 29ఏ కింద నమోదైన ఆయా రాజకీయ పార్టీలు. గత సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ లేదా శాసనసభకు పోలైన ఓట్లలో కనీసం ఒక్క శాతం కంటే తక్కువ కాకుండా ఓట్లను సాధించిన పార్టీలు ఈ పథకం కింద ఎలక్ట్రోరల్ బాండ్లను స్వీకరించడానికి అర్హులు. ఎలక్ట్రోరల్ బాండ్‌లను అర్హత కలిగిన రాజకీయ పార్టీ అధీకృత బ్యాంక్‌లోని బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే ఎన్‌క్యాష్ చేయాలి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చీఎచీ దశ విక్రయంలో దాని 29 అధీకృత శాఖల ద్వారా (అనుబంధంలో జతచేయబడిన జాబితా ప్రకారం) ఎలక్ట్రోరల్ బాండ్‌లను జారీ చేయడానికి, ఎన్‌క్యాష్ చేయడానికి 01.01.2022 నుండి 10.01.2022 వరకు.అధికారం కలిగిఉంది. ఎలక్ట్రోరల్ బాండ్‌లు జారీ చేసిన తేదీ నుండి పక్షం (పదిహేను క్యాలెండర్ రోజుల) వరకు చెల్లుబాటులో ఉంటాయి. చెల్లుబాటు వ్యవధి ముగిసిన తర్వాత ఎలక్ట్రోరల్ బాండ్ డిపాజిట్ చేయబడితే, సదరు పార్టీకి చెల్లింపులు చేయబడవు. అర్హత కలిగిన రాజకీయ పార్టీ తన ఖాతాలో జమ చేసిన ఎలక్ట్రోరల్ బాండ్ల మొత్తం అదే రోజున జమ చేయబడుతాయి.

ఒమిక్రాన్ ప్రబలుతుంటే నుమాయిష్ ఏంటి..?

హైదరాబాద్, డిసెంబర్ 31:కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ దేశంలో వ్యాప్తి చెందుతున్న క్రమంలో నుమాయిష్‌కు సీఎం కేసీఆర్ అనుమతించడం ఏమిటని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్ అయ్యారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం వల్ల వైరస్ సులభంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు నూతన సంవత్సర వేడుకలపై అనేక ఆంక్షలు విధిస్తుంటే, తెలంగాణలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం

రెండో డోసు వ్యాక్సిన్ వేయించుకోవాలి.. ఇంటింటా తిరిగి వ్యాక్సిన్ వేసేందుకు ఏర్పాట్లు : కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు, డిసెంబర్ 31: మొదటి డోసు వ్యాక్సిన్ వేయించుకుని రెండవ డోసుకు సమయం దగ్గర పడ్డ వాళ్లందరూ వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవాలని కలెక్టర్ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. రెండవ డోసు వ్యాక్సిన్ వేయించుకోవాల్సిన వారు జిల్లాలో సుమారు 74వేల మంది ఉన్నారన్నారు. వీరందరూ ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రెండు, మూడు రోజులలో వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. కరోనా వ్యాక్సిన్ అన్ని గ్రామ, వార్డు సచివాలయాలలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సెంటర్లలో వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అర్హులందరూ కరోనా టీకా వేయించుకుని వైరస్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటింటా వ్యాక్సినేషన్ కార్యక్రమం కూడా నిర్వహించడం జరుగుతుందని ఒమిక్రాన్ వేరియంట్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ ఖచ్చితంగా వేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఒమిక్రాన్ వేరియంట్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో 100 శాతం వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తయ్యేటట్లు చూడాలన్నారు.

కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా మాస్కులు ధరించాలన్నారు. సామాజిక దూరం పాటించడం తరచూ చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. ఒమిక్రాన్ వేరియంట్ అత్యంత ప్రమాద కరంగా ఉందని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకొని కొవిడ్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

అమరావతి, డిసెంబర్ 31:అనంతపురం జిల్లా లేపాక్షిలో ఓఒఅ మహమ్మద్ ఇక్బాల్ కారుకు స్వల్ప ప్రమాదం జరిగింది. వున్నపళంగా కారుకు వృద్ధుడు అడ్డురావడంతో వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారులోనే వున్న ఓఒఅ మహమ్మద్ ఇక్బాల్.. తక్షణమే స్పందించి 50,000 రూపాయలు బంధువులకు ఇచ్చి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అవసరమైతే బెంగళూరుకు సైతం తీసుకువెళ్లి తగు పరీక్షలు చేయించాలని ఆదేశించారు

నేటి నుంచి బెజవాడలో బుక్ ఫెస్టివల్.. 11 రోజులపాటు పుస్తక మహోత్సవం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: 32వ విజయవాడ పుస్తకమహోత్సవం జనవరి 1వ తేదీన ప్రారంభం అవుతుందని బుక్ ఫెస్టివల్ ఉత్సవ కమిటి కన్వినర్ విజయ్ కుమార్ తెలిపారు.. పీడబ్ల్యూ గ్రౌండ్ లో జరగనున్న ఈ మహోత్సవాన్ని గవర్నర్ బిష్వభూషణ్ హరిచందన్ ప్రారంభిస్తారని 11 రోజుల పాటు బుక్ ఫెస్టివల్ జరగనుందన్నారు. నగరంలోని పిడబ్ల్యూడి గ్రౌండ్ లో బుక్ ఫెస్టివల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా అధికార యాంత్రంగం సహయ సహాయ సహకారాలతో ఈ సంవత్సరం ఎర్పాట్లు చేశామన్నారు..

రాష్ట్ర గవర్నర్ పుస్తక పండుగ ఎర్పాట్లకు 5 లక్షలు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు.. 11రోజులు పాటు సాహిత్య సభలు, సంస్మరణ సభలు, పుస్తక పఠనం పెంపోందించే కార్యక్రమాలు.. ప్రతి రోజు ఎగ్జిబిషన్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బుక్ ఎగ్జిబిషన్ సోసైటి అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ 11రోజులుపాటు జరిగే పుస్తకాల పండుగలో మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.. ప్రతి సంవత్సరం లాగానే 10శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఈ సంవత్సరం కూడా కొనసాగుతుందనని.. మధ్యాహ్నం 2 గంటలనుండి రాత్రి 10గంటలవరకు బుక్ ఫెస్టివల్ కొనసాగుతుందన్నారు.

ట్రావెల్ హిస్టరీ లేకున్నా.. ముంబయిలో 141 మందికి ఒమిక్రాన్..

ముంబయి,డిసెంబర్ 31: ముంబయి లోకల్ పీపుల్స్ కి ఎటువంటి ట్రావెల్ హిస్టరీ లేకున్నా ఒమిక్రాన్ వైరస్ అటాక్ అయ్యింది. ఈ మేరకు ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 21, 22 తేదీల్లో వచ్చిన కరోనా కేసులకు సంబంధించి కొవిడ్ శాంపుల్స్ సేకరించామని, వారిలో దాదాపు 37శాతం మందికి అస్సలు ఎటువంటి ట్రావెల్ హిస్టరీ లేదని, అయినా ఒమిక్రాన్ వైరస్ అటాక్ అయినట్లు తెలిపారు. 375 మంది నుంచి సేకరించిన శాంపుల్స్ లో 141 మందికి ఒమిక్రాన్ సోకిందని, వీరంతా ఎలాంటి ట్రావెల్ హిస్టరీ లేని వారేనని బీఎంసీ అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈ 141 మందిలో 89 మగాళ్లు, 52 మంది ఆడాళ్లున్నారు. వీరిలో 93 మంది రెండు డోసులు, మరో ముగ్గురు సింగిల్ డోస్ వ్యాక్సిన్ కూడా వేసుకున్న వారు ఉన్నట్టు తెలిపారు.

అయితే ఒమిక్రాన్ సోకిన వారిలో 95 మందికి వైరస్ లక్షణాలు కనిపించగా, 39 మందికి అతితక్కువగా, ఏడుగురికి మధ్యస్తంగా కరోనా లక్షణాలున్నాయి. ఇప్పటికి ముంబయి సిటీలో 153 మందికి ఒమిక్రాన్ సోకగా వీరిలో 12 మంది మాత్రమే ఇంటర్నేషనల్ ట్రావెల్ హిస్టరీ కలిగి ఉన్నారు. అయితే ఎట్లాంటి ట్రావెల్ హిస్టరీ లేని 141 మంది ముంబయి నివాసుల్లో అత్యధికంగా 21మంది అంధేరి వెస్ట్, జుహు, వెర్సోవాలల వారే ఉన్నారు. ఆ తర్వాత మలబార్ హిల్, మహాలక్ష్మి, టర్డియో ప్రాంతాల వారు ఉన్నారని అధికారులు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో 17,500 కోట్ల రూపాయలకు పైగా విలువైన 23 పథకాలలో కొన్నింటిని ప్రారంభించి, మరి కొన్నింటికి శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 17,500 కోట్ల రూపాయల పై చిలుకు విలువైనటువంటి 23 పథకాల ను ఈ రోజు న ఉత్తరాఖండ్ లో అయితే ప్రారంభించడమో లేదా శంకు స్థాపన చేయడమో చేశారు. ఆయన లఖ్ వాడ్ బహుళ ప్రయోజక ప్రాజెక్టు కు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ను తొలుత 1976వ సంవత్సరం లో రూపొందించగా, చాలా ఏళ్ళ పాటు అది పెండింగు పడింది. ఆయన 8700 కోట్ల రూపాయల విలువైన రహదారి రంగ ప్రాజెక్టుల కు సైతం ప్రారంభోత్సవం/ శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పథకాలు దూర ప్రాంతాల లో, గ్రామీణ ప్రాంతాల లో, ఇంకా సరిహద్దు ప్రాంతాల లో సంధానాన్ని మెరుగు పరచాలన్న ప్రధాన మంత్రి దృష్టి కోణాన్ని ఆచరణాత్మకం చేసేటటువంటివి.

ఆయన ఉధమ్ సింహ్ నగర్ లో ఎఐఐఎమ్ఎస్ రుషికేశ్ శాటిలైట్ సెంటర్ కు మరియు పిథోరాగఢ్ లో జగ్ జీవన్ రామ్ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాని కి గాను పునాది రాయి ని కూడా వేశారు. ఈ శాటిలైట్ సెంటర్ లు దేశం లోని అన్ని ప్రాంతాల లో ప్రపంచ శ్రేణి వైద్య చికిత్స సదుపాయాల ను కల్పించాలన్న ప్రధాన మంత్రి ప్రయాసల కు అనుగుణం గా ఉన్నాయి. ఆయన కాశీ పుర్ లో అరోమ పార్కు కు, సితార్ గంజ్ లో ప్లాస్టిక్ ఇండస్ట్రియల్ పార్కు కు, ఇంకా గృహ నిర్మాణం, పారిశుధ్యం, ఇంకా తాగునీటి సరఫరాల కు సంబంధించిన అనేక ఇతర కార్యక్రమాల కు కూడాను శంకుస్థాపన చేశారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, కుమాఊం తో తనకు దీర్ఘ కాలం గా ఉన్న అనుబంధాన్ని గుర్తు కు తెచ్చుకొన్నారు. ఉత్తరాఖండ్ కు చెందిన టోపీ తో తన ను సమ్మానించినందుకు గాను ఆ ప్రాంత ప్రజల కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ దశాబ్దం ఉత్తరాఖండ్ యొక్క దశాబ్దం అని తాను ఎందుకు అనుకొంటున్నది ప్రధాన మంత్రి వివరంగా చెప్పారు. ఉత్తరాఖండ్ ప్రజల శక్తి ఈ దశాబ్ది ని ఉత్తరాఖండ్ యొక్క దశాబ్దం గా తీర్చిదిద్దనుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఉత్తరాఖండ్ లో ఆధునిక మౌలిక సదుపాయాలు పెరుగుతుండటం, చార్ ధామ్ ప్రాజెక్టు, కొత్త రైలు మార్గాల నిర్మాణం వంటివి ఈ దశాబ్దాన్ని ఉత్తరాఖండ్ యొక్క దశాబ్దం గా మార్చివేస్తాయి అని ఆయన అన్నారు. జల విద్యుత్తు రంగం లో, పరిశ్రమ రంగం లో, పర్యటన రంగం లో, ప్రాకృతిక వ్యవసాయ రంగం లో, ఇంకా సంధానం రంగం లో ఉత్తరాఖండ్ వేసినటువంటి అడుగులు ఈ దశాబ్ది ని ఉత్తరాఖండ్ యొక్క దశాబ్దం గా మార్చుతాయి అని ఆయన అన్నారు.

పర్వత ప్రాంతాల ను అభివృద్ధి కి దూరం గా ఉంచినటువంటి ఆలోచన స్రవంతి కి, పర్వత ప్రాంతాల ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆలోచన స్రవంతి కి మధ్య గల భేదాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

అభివృద్ధి మరియు సదుపాయాలు లోపించడం తో ఎంతో మంది ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాల కు ప్రవాసం వెళ్లారు అని ఆయన అన్నారు. ప్రభుత్వం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' (అందరి తో కలసి అందరి పురోగతి కోసం) అనే స్ఫూర్తి తో కృషి చేస్తోంది అని ఆయన అన్నారు. ఉధమ్ సింహ్ నగర్ లో ఎఐఐఎమ్ఎస్ రుషికేశ్ శాటిలైట్ సెంటర్ కు, పిథోరాగఢ్ లో జగ్ జీవన్ రామ్ ప్రభుత్వ వైద్య కళాశాల కు శంకుస్థాపన తో రాష్ట్రం లో వైద్య సంబంధి మౌలిక సదుపాయాల కల్పన బలోపేతం కానుంది అని ఆయన చెప్పారు. ఈ రోజు న ప్రారంభం అవుతున్నటువంటి పథకాలను కూడా కలుపుకొంటే ఈ ప్రాజెక్టు లు రాష్ట్రం లో సంధానాన్ని మెరుగు పరుస్తాయి అని ఆయన పేర్కొన్నారు. ఇవాళ వేస్తున్నటువంటి పునాదిరాళ్ళ విషయం లో పూర్తి సంకల్ప శక్తి ద్వారా ఆయా పథకాల కు ఆచరణ రూపాన్ని ఇవ్వడం జరుగుతుంది అని ఆయన అన్నారు. గతం లో జరిగిన మోసాన్ని మరియు గతం లో ఎదురైన ఇక్కట్టుల ను ప్రస్తుతం సమరస భావన లోకి, ఇంకా సౌకర్యాల రూపం లోకి మార్చడం జరుగుతోంది అని ఆయన అన్నారు.

గడచిన ఏడు సంవత్సరాల లో హర్ ఘర్ జల్ ద్వారా, టాయిలెట్ ల ద్వారా, ఉజ్జ్వల పథకం ద్వారా, పిఎమ్ఎవై ద్వారా మహిళల జీవనం కొత్త సౌకర్యాల కు, గౌరవానికి నోచుకొంటున్నది అని కూడా ఆయన అన్నారు.

ప్రభుత్వ పథకాల లో జాప్యం అనేది ఇదివరకు అధికారం లో ఉన్న వారి శాశ్వత వ్యాపార చిహ్నం గా ఉండింది అని ప్రధాన మంత్రి అన్నారు. "ఈ రోజు న, ఉత్తరాఖండ్ లో ప్రారంభించినటువంటి లఖ్ వాడ్ ప్రాజెక్టు కు ఇటువంటి చరిత్రే ఉంది. ఈ ప్రాజెక్టు ను గురించి మొట్టమొదట గా 1976వ సంవత్సరం లో ఆలోచన చేయడమైంది. ఇవాళ 46 సంవత్సరాల తరువాత దీని నిర్మాణాని కి శంకుస్థాపన ను మా ప్రభుత్వం చేసింది. ఈ జాప్యమనేది ఒక నేరాని కంటే తక్కువేం కాదు" అని ఆయన అన్నారు.

ప్రభుత్వం గంగోత్రి నుంచి గంగా సాగర్ వరకు ఒక మిశన్ లో తలమునకలుగా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. గంగా నది లోకి కలుస్తున్న మురుగునీటి కాలువల సంఖ్య టాయిలెట్ ల నిర్మాణం ద్వారా, ఉత్తమ మురుగునీటి పారుదల వ్యవస్థ ద్వారా, ఆధునిక జల శుద్ధి సదుపాయాల ద్వారా శర వేగం గా తగ్గిపోతున్నది. అదే విధం గా, నైనీతాల్ సరస్సు పట్ల సైతం శ్రద్ధ వహించడం జరుగుతోంది అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం నైనీతాల్ లోని దేవస్థల్ లో భారతదేశం లో కెల్లా అతి పెద్దదైనటువంటి ఆప్టికల్ టెలిస్కోపు ను కూడా ఏర్పాటు చేసింది అని ప్రధాన మంత్రి చెప్పారు. ఇది దేశంలోని, విదేశాలలోని శాస్త్రవేత్తల కు ఒక కొత్త సదుపాయాన్ని ఇవ్వడం ఒక్కటే కాకుండా ఈ రంగం ఒక సరికొత్త గుర్తింపున కు కూడా నోచుకొన్నది అని ఆయన అన్నారు. ప్రస్తుతం దిల్లీ లోను, దేహ్ రాదూన్ లోను ఉన్నటువంటి ప్రభుత్వాలు అధికార వ్యామోహం తో కాక సేవా స్ఫూర్తి తో నడుస్తున్నాయి అని ఆయన అన్నారు.

సరిహద్దు రాష్ట్రం అయినప్పటికీ కూడా రక్షణ సంబంధి అవసరాల ను అలక్ష్యం చేయడం అనే యథార్థం కడు శోచనీయం అని ప్రధాన మంత్రి అన్నారు. సంధానం తో పాటు గా దేశ భద్రత కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఉపేక్షించడం జరిగింది. సైనికులు సంధానం కోసం, అత్యవసరమైన కవచం కోసం, మందుగుండు సామాను కోసం, ఆయుధాల కోసం చివరకు ఆక్రమణదారులకు, ఉగ్రవాదుల కు దీటైన సమాధానాన్ని ఇవ్వడాని కి సైతం వేచి ఉండవలసి వచ్చింది అని ఆయన అన్నారు.

అభివృద్ధి తాలూకు జోరు ను పెంచుకోవాలి అని ఉత్తరాఖండ్ కోరుకొంటోంది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ''మీ కలలే మా సంకల్పాలు; మీ అభిలాషే మాకు ప్రేరణ గా ఉంది; మరి మా బాధ్యత ఏమిటి అంటే అది మీ యొక్క ప్రతి అవసరాన్ని నెరవేర్చడం" అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్ ప్రజల యొక్క సంకల్పం ఈ దశాబ్ది ని ఉత్తరాఖండ్ యొక్క దశాబ్ది గా తీర్చిదిద్దనుంది అని ఆయన అన్నారు.

మహిళలను, వారి కుటుంబాలను వృద్ధి చేసిన గోల్డ్ డ్రాప్

అమరావతి, డిసెంబర్ 31:ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్నటువంటి లోహియా ఎడిబల్ ఆయిల్ వద్ద సమ్మిళిత ఉద్యోగావకాశాలను అందించడం ద్వారా మహిళలు, వారి కుటుంబాల జీవితాలను గోల్డ్ డ్రాప్ వృద్ధి చేసింది. ఈసందర్భంగా సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా మాట్లాడుతూ? తాము కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి మహిళలు, వారి కుటుంబాలలో వెలుగులు తీసుకురావడానికి గోల్డ్ డ్రాప్ వద్ద ప్రయత్నిస్తూనే ఉన్నామన్నారు. సమ్మిళిత పనివాతావరణం కల్పించినప్పుడు మాత్రమే మంచి అన్నది సాధ్యమవుతుందన్నారు.

భారతదేశ వ్యాప్తంగా లింగ వివక్షత అనేది ఉద్యోగాలలో ఉందని తమకు తెలుసు కానీ, తాము ఈ అంతరాన్ని వీలైనంతగా తగ్గించడం ద్వారా చేయగలిగినంతగా మంచిని చేయగలుగుతున్నామన్నారు.

తమ సిబ్బందిలో చాలామంది తమ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వ్యక్తులేనన్నారు. తమ సిబ్బందిలో మహిళలు ఎక్కువగా ప్యాకేజింగ్ విభాగంలో పనిచేస్తుంటారన్నారు. అతి తక్కువ శబ్దం, వేడి, ధూళి రహిత వాతావరణం అక్కడ ఉంటుందన్నారు. దీని వల్ల వారు కంపెనీ కార్యకలాపాలలో అత్యంత కీలకమైన ప్యాకేజింగ్ విభాగంలో పూర్తి శ్రద్ధతో కార్యకలాపాలు చేసేందుకు వీలు కలుగుతుందని అన్నారు. గోల్డ్ డ్రాప్ వద్ద వినియోగదారుల భద్రత అత్యంత కీలకమైన అంశమన్నారు. ఈ ప్యాక్‌లన్నీ కూడా టాంపర్ ప్రూఫ్ సీల్స్ కలిగి ఉంటాయన్నారు. ప్యాకేజింగ్, స్టోరేజీని పూర్తి ఆరోగ్యవంతమైన ప్రమాణాలలో చేయడం ద్వారా వినియోగదారుల పట్ల సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు.

పుదుచ్చేరి నుంచి హైదరాబాద్ కు విమాన సర్వీసులు పునఃప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 31:పుదుచ్చేరి లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ కృషి కారణంగా హైదరాబాద్ పుదుచ్చేరి హైదరాబాద్‌ల మధ్య విమానాలు జనవరి నుంచి పున:ప్రారంభం కానున్నాయి.

కరోనా కారణంగా రద్దయిన పుదుచ్చేరి హైదరాబాద్ విమానాలను తిరిగి పునరుద్ధరించాలంటూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి గవర్నర్ లేఖలు రాయడంతో పాటు టెలిఫోనిక్ కాల్స్ పుదుచ్చేరి హైదరాబాద్‌ల మార్గంలో నేరుగా విమా కనెక్టివిటీని పునరుద్ధరించాలని కోరారు.

ఫలితంగా విమాన కనెక్టివిటీని పునరుద్ధరించడంతో పాటు స్పైస్ జెట్‌కు వయాబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద మద్ధతును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.

ఎయిర్ కనెక్టివిటీ పునరుద్ధరణతో హైదరాబాద్, పుదుచ్చేరిల మధ్య సందర్శనలకు ప్లాన్ చేసి పర్యాటకులు, వ్యాపారవేత్తలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాజ్‌భవన్ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

తెలంగాణ టూరిజం విభాగం కారైక్కల్ సమీపంలోని ప్రసిద్ధ వేలంకన్ని చర్చి, నాగోర్ దుర్గా, తిరునల్లార్ శనీశ్వర్ దేవాలయాన్ని కలుపుతూ, తమిళనాడుతోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం మహాబలిపురంలో కూడా ఆధ్యాత్మిక పర్యటనలను నిర్వహించవచ్చని గవర్నర్ సూచించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పుదుచ్చేరి నుంచి హైదారాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని ఇతర పర్యాటక ప్రదేశాలకు సందర్శనలు నిర్వహించవచ్చని గవర్నర్ తెలిపారు.

చిత్తూరు జిల్లాలో భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

అమరావతి, డిసెంబర్ 31:చిత్తూరు జిల్లాలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా, అమ్మకం పైన చిత్తూరు జిల్లా ఎస్పీ ఎస్. సెంథిల్ కుమార్ (ఐపిఎస్) ఆదేశాల మేరకు జాయింట్ డైరెక్టర్ ఎస్ఈబీ వి.విద్యసాగర్ నాయుడు, (ఐపీఎస్) స్పీయ పర్యవేక్షణలో చిత్తూరు డీఎస్పీ యన్ సుధాకర్ రెడ్డి నేతృత్వంలో దాడులు నిర్వహించారు. ఈ కార్యాచరణలో భాగంగా వచ్చిన రహస్య సమాచారం మేరకు చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కే.బాలయ్య, చిత్తూరు తాలుకా సబ్-ఇన్ స్పెక్టర్ వి.రామక్రిష్ణయ్య, సిబ్బందితో కలసి 27.12.2021 వతేది రాత్రి 7 గంటలకు చిత్తూరు-వేలూరు రోడ్డులో మాపాక్షి మలుపు వద్ద వాహనములను తనిఖీ చేస్తుండగా వేలూరు వైపు నుండి చిత్తూరు వైపుగా వస్తున్న ఒక అనుమానాస్పదంగా ఉన్న పాల మినీలగేజి వాహనాన్ని అదుపులో తీసుకొని తనిఖీ చేయగా అందులో అక్రమంగా రవాణా చేస్తున్న 200 కేసులు (10000 సిల్వర్ కప్ వీఎస్ఓపీ బ్రాంది బాటిళ్లు) కర్ణాటక మద్యంను గుర్తించి అందులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవడమైనది.

విచారణలో ముద్దాయిలు నిషేధిత కర్ణాటక మద్యంను కర్ణాటక రాష్ట్రం నుండి ఏపీకి అక్రమంగా భారీ ఎత్తున రవాణా చేసి పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించినట్లుగా, వీరిపై జిల్లాలో అనేక కేసులు ఉండి జైలుకు కుడా వెళ్లి వచ్చినట్లు తెలిసింది. నదరు ముద్దాయిలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కే.బాలయ్య, చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ సబ్-ఇన్ స్పెక్టర్ వి.రామక్రిష్ణయ్య, చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించారు. పుణ్య సముద్రం కార్తీక్ (24), రాళ్లపల్లి సురేష్ బాబు (36)లను అరెస్ట్ చేయగా, ప్రధాని నిందితుడైన చిత్తూరు ఉమాశంకర్ రెడ్డి, చిత్తూరు చక్రి, అరగొండ ప్రతాప్ నాయుడు, బెంగళూరుకు చెందిన వేణులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ప్రతిష్ఠంభనకు తెరదించండి : సీఎం కు సీపీఎం శ్రీనివాసరావు లేఖ

అమరావతి, డిసెంబర్ 31:రాష్ట్ర ప్రభుత్వద్యోగులకు 11వ పిఆర్‌సి ఫిట్‌మెంట్‌పై ప్రతిష్ఠంభన కొనసాగుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. దాదాపు 2 సంవత్సరాలకు పైగా జాప్యం చేయడం వల్ల క్రింది స్థాయిలో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు నిర్వహిస్తున్న చర్చలతో మరింత జాప్యం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మీరే స్వయంగా చర్చలు జరిపి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పిఆర్‌సి ప్రకటించాలని కోరుతున్నట్లు తెలిపారు. చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ నివేదికలోని సిఫార్సులపై ఉద్యోగ సంఘాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇప్పటికే వారు 27శాతం ఇంటీరమ్ రిలీఫ్ తీసుకొంటున్నారు. అంతకన్నా ఎక్కువ ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరుగుతుందని ఉద్యోగులు ఎదురు చూస్తున్న తరుణంలో సిఎస్ కమిటీ 14.29శాతం మాత్రమే సిఫార్సు చెయ్యడంపైన ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. దీనికి తోడు ఇంటి అద్దెల కుదింపు, సిసిఎ రద్దు, పిఆర్‌సి కాలాన్ని పొడగించడం వంటి సిఫార్సులపైనా అసంతృప్తి ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రెగ్యులర్‌గా పిఆర్‌సిలు ప్రకటించి ఉంటే ప్రస్తుతం 13వ పిఆర్‌సి అమలు కావాలన్నారు.

కానీ జరిగిన జాప్యం వలన ఉద్యోగులు10 సంవత్సరాలు అనగా 2 పిఆర్‌సిల కాలాన్ని కోల్పోయారన్నారు. ప్రస్తుతం 11వ పిఆర్‌సిలోనైనా పెరిగిన ధరలు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులకు తగిన విధంగా వేతన పెంపు కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు మీరు పిఆర్‌సి వెంటనే ఇస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లిస్తామని, వారిని రెగ్యులరైజ్ చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చెయ్యాల్సింది ఉద్యోగులేనని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఈ కృషిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్, కంటింజెంట్, డైలీవేజ్ ఉద్యోగులు కూడా పాలుపంచుకొంటున్నారన్నారు. వీరందరికీ సకాలంలో పిఆర్‌సి అమలు చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో పై ఉద్యోగుల అన్ని సంఘాల నాయకులతో మీరే స్వయంగా వెంటనే చర్చలు జరిపి పిఆర్‌సి, ఇతర సమస్యలను పరిష్కరించమని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలకు మంత్రి పేర్ని నాని దూరం !!

అమరావతి, డిసెంబర్ 31: ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది 2022 నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పేర్కొన్నారు. మన రాష్ట్రంలో సైతం ఒమిక్రాన్ కేసులు శరవేగంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రజల ఆరోగ్యంకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నూతన సంవత్సరం వేడుకలు తాను జరుపుకోవడం లేదని మంత్రి తెలిపారు. కొత్త సంవత్సర వేడుకలు మీ కుటుంబసభ్యుల మధ్యలో మీరు ఆనందంగా జరుపుకోవాలని తాను కోరుకుంటున్నాను.. కొత్త ఏడాది వేడుకల తరువాత ఒకవేళ ఒమిక్రాన్ లక్షణాలు వస్తే, కుటుంబం మొత్తం బాధ పడాలి? కాబట్టి ముందు జాగ్రత్తలు తప్పనిసరి అని ఆయన అన్నారు.

కోవిడ్ నివారణకు రెండు వాక్సిన్లు తీసుకున్నవారు ఒకవేళ హోటెల్లు, రెస్టారెంట్లలో బహిరంగంగా వేడుకలు చేసుకునే వారు, ఎంతో కొంత భౌతిక దూరం పాటించాలని, అలాగే మాస్కు ధరించి గతంలో మాదిరిగానే శానిటైజర్లు వినియోగించాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఒమిక్రాన్ విస్తరిస్తున్న దృష్ట్యా వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గం ప్రజలు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఎవరూ తనను కలవడానికి రావద్దని? తాను అందుబాటులో ఉండటం లేదని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు చేయూత సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే దాసరి

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతను అందిస్తున్నామని పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు 26 లక్షల 77 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ ఎంపీపీలు స్రవంతి శ్రీనివాస్, నునేటి సంపత్, కాల్వశ్రీరాంపూర్ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్, నాయకులు వాసు, రాజయ్యలతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

వస్త్ర ప

ప్రముఖ సినీ నిర్మాతకు మర్యాద పూర్వకంగా కలిసిన కొండ దేవయ్య



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి):సినీ నిర్మాత , దర్శకుడు సానా యాదిరెడ్డి పటేల్ నుమున్నూరుకాపు రాష్ట్ర నాయకులు కొండ దేవయ్య పటేల్ , మున్నా జర్నలిస్టు పోరం కన్వీనర్ కొత్త లక్ష్మణ్ పటేల్ లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు .అనంతరం శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

జాతీయస్థాయి పరుగు పందెంపోటీ కి ఎంపికైన క్రీడారత్నాలు

- క్రీడా ఆణిముత్యాలను దాతలు ఆదుకోవాలని
-యువజన సంఘం అధ్యక్షులు సోమినేని బాలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం లోని అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన బాలికలు గాదార్ల ప్రవళిక , గాదార్ల శిరీష జాతీయ స్థాయి 6 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగుపందాల పోటీలకు ఎంపికైనట్లుజిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సోమినేని బాలు ఒక ప్రకటన తెలిపారు. ఎంపికైన బాలికలు వేములవాడ లోని ధార్మిక డిగ్రీ కాలేజ్ లో చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి 6 కిలోమీటర్ క్రాస్ కంట్రీ పరుగుపందెం పోటీల్లో ఎంపిక అయ్యారు .ఈ నెల జనవరి 15 నుండి నాగాలాండ్ రాష్ట్రంలో జాతీయస్థాయి పోటీలకు మన రాష్ట్రం నుంచి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు .

పేద క్రీడాకారిణ లకు ఆర్థిక సాయం అందించాలని సోమినేని బాలు కోరారు

దేవయ్య కుటుంబానికి బియ్యం అందజేసిన ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గతవారం రోజుల క్రితం చనిపోయిన వంకాయల దేవయ్య కుటుంబాన్ని శుక్రవారం స్థానిక ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.కుటుంబంలోని ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు .అనంతరం ఎంపీటీసీ వ్యక్తిగతంగా 25 కిలోల బియ్యాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు .గతంలో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారిని పరామర్శించి తన వంతుగా బియ్యం అందజేస్తూగాలి పెల్లి స్వామి తన భక్తిని చాటుకుంటున్నారు .ఎంపీటీసీ వెంట కాసర్ల అరుణ్ కుమార్ పార్వతి వేణు కూతురు బక్కయ్య పార్వతి సాయిలు గాలి పెల్లి శ్రీనివాస్ పార్వతి రాములు పార్వతి జంపయ్య బెజగం దేవరాజు ఉన్నారు



శివరామిరెడ్డికి బావి సెంటిమెంట్ : పూడ్చిన బావిని తవ్విస్తున్నారు

అమరావతి, డిసెంబర్ 31:అనంతపురం :భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని ఎక్కువ మంది ప్రజలు పాటిస్తుంటారు. ప్రతి ఒక్కరికి ఒక సెంటిమెంట్ ఉంటుంది. తమ జీవితం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా.. సాఫీగా సాగాలని.. ఆయురారోగ్యాలు.. సిరి సంపదలు, అధికారిక పదవులు అనుభవించాలని తపన పడేవారు.. రకరకాల వ్రతాలు, పూజలు పునస్కారాలు.. మొక్కుబడులు ఇలా తమకు తోచినది ఆచరించి అమలు చేస్తూ ఉంటారు. అందులో విజయం సాధించిన వారు తాము నమ్ముకున్న దానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూజిస్తుంటారు. ఆ విధంగానే.. ఇటీవల లోకల్ బాడీ ఎమ్మెల్సీ గా ఎన్నికైన శివరామిరెడ్డి ? ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అన్ని విధాలా తనకు బాగుండాలంటే గ్రామంలో ఉన్న పాడుపడిన బావిని.. తిరిగి తవ్వించాలని సిద్ధాంతులు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ బావిని పూడ్చిన అప్పటి నుంచి.. శివరామరెడ్డి కి అన్ని విధాలా పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో బావిని తిరిగి తవ్వించాలని, పూజారులు సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత బావి తవ్వే పనికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన మరికొందరు ఆ బావి మీద తమకు హక్కులున్నాయని, తవ్వ కూడదని ఆక్షేపిస్తున్నారు.

2018లో పూడ్చిన బావి పూర్వీకుల స్థిరాస్తి 574,75 సర్వే నెంబర్లు ఉన్న పాడుబడిన బావిని సంబంధీకులు పూడ్చి వేశారు. పైగా పాడుబడి నీళ్లు లేకపోవడంతో వలు ప్రమాదాలు జరగడంతో పూడిచి వేశామన్నారు. ఆరు నెలల కిందట గ్రామకంఠం కింద ఉందని ఎమ్మెల్సీ శివరామి రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు .ఇప్పుడు కోర్టు తీర్పు వచ్చిందని తన అనుచరులను పిలిపించుకొని ఎమ్మెల్సీ జేసీబీతో మట్టిని తవ్విస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివరామి రెడ్డి గ్రామ కంఠం సంబంధించిన భావి అని హైకోర్టును ఆశ్రయించారు. అయితే పంచాయతీ అధికారులు గ్రామ కంఠం అని కోర్టుకు తెలియజేశారు. అధికారులు శివరామి రెడ్డి చెప్పినట్లు వింటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఆర్డర్ వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే బాధితులు మాత్రం కోర్టు ఆర్డర్ కాదు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు

ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికులపై జీఎస్టీ బాదుడు

అమరావతి, డిసెంబర్ 31:ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచన తెలియజేసింది. ఆర్టీసీ టికెట్ బుకింగ్ సేవలు అందిస్తున్న అభిబస్, రెడ్‌బస్, పేటీఎం పోర్టల్స్‌లో టికెట్లు కొనుగోలు చేసేవారికి షాకింగ్ న్యూస్ ను తెలిపింది. జనవరి 1 నుంచి టికెట్ బుకింగ్ పై 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. పూర్తి సేవా దృక్పథంతో నిర్వహించే ఆర్టీసీ పోర్టల్, ఆర్టీసీ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకునే టికెట్లకు, నేరుగా బస్సుల్లో తీసుకునే టికెట్లకు జీఎస్టీ ఉండదని తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని.. ఆర్టీసీ పోర్టల్, ఏజెంట్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోమని కోరుతున్నారు.

ఇదిలా ఉంటె సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ఏపీఎస్ ఆర్టీసీ 1266 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి పలు ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయి. జనవరి 7 నుంచి 17 వరకు ఈ బస్సులు నడవనున్నాయి.

విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 362 బస్సులు, బెంగళూరుకు 14, చెన్నైకు 20 బస్సులు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరానికి 390 బస్సులు, విజయవాడ- రాజమహేంద్రవరం మధ్య 360 బస్సులు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు 120 బస్సులు నడుస్తాయని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువు పెంచబోం : నిర్మల సీతారామన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31:ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు గడువును పెంచాలనే ప్రతిపాదన లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం చెప్పారు. ఐటీఆర్ దాఖలుకు గడువు 2021 డిసెంబరు 31 అని పన్ను చెల్లింపుదారులు గమనించాలని విలేకర్ల సమావేశంలో తెలిపారు.

రెవిన్యూ కార్యదర్శి తరుణ్ బజాజ్ మాట్లాడుతూ, ఐటీఆర్‌ల దాఖలు సజావుగా జరుగుతోందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు 5.62 కోట్ల రిటర్నులు దాఖలైనట్లు తెలిపారు. ఈ సంవత్సరం గతం కన్నా 60 లక్షలు ఎక్కువ రిటర్నులు దాఖలయ్యాయన్నారు.

2019-20 ఆర్థిక సంవత్సరానికి ఐటీఆర్‌ల ఈ-వెరిఫికేషన్ పూర్తి కానటువంటి అసెస్సీలు 2022 ఫిబ్రవరి 28నాటికి వెరిఫికేషన్ ప్రాసెస్‌ను పూర్తి చేసుకోవచ్చునని ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది.

విగ్రహ ప్రతిష్టాపనలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 31:చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల పరిధిలోని పిల్లగుండ్ల గ్రామంలో ఈరోజు జరిగిన ఎల్లమ్మ తల్లి బోనాలలో, శంకర్ పల్లి మునిసిపాలిటీ పరిధి చిన్న శంకర్ పల్లిలో బీరప్ప-మల్లన్న దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కె.యాదయ్య తో కలిసి విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు..! -జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి)ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

2021 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2022 కు స్వాగతం పలుకుతూ అందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

గత సంవత్సరం కరోనాతో ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కొన్నామని కొత్త సంవత్సరం కరో నా నుండి పూర్తిగా విముక్తి పొందాలని కలెక్టర్ కోరారు.

కరోనా మహమ్మారి దరిచేరకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధిగా మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరుతూ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజన్న దర్శించుకున్న డైరెక్టర్ సంపత్ నంది

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని శుక్రవారం తెలుగు సినిమా డైరెక్టర్ సంపత్ నంది దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదపండితులు వారిని ఆశీర్వదించారు . ముందుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు , నియోజకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ , ఆది పుష్ప గుచ్చం అందజేసి ఘనస్వాగతం పలికారు . డైరెక్టర్ సంపత్ నంది పలు సినిమలు బెంగాల్ టైగర్,సిటీ మార్ ,రచ్చ, గౌతమ్ నంద , పేపర్ బాయ్ తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు.ఆయన వెంట నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ,తుమ్ మధు, కనికరపు రాకేష్, ఖమ్మం గణేష్, నాగుల రాము గౌడ్, ఎర్ర శ్రావణ్, పళ్ళకొండ అమర్, ముద్ర గణేష్, అరిగెల శశాంక్, మె0డే రాజు, సాగర్, తదితరులు ఉన్నారు

గిరిజన పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఆదిలాబాద్. డిసెంబర్ 31:రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జిల్లా దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా అడవి ప్రాంతంకి దగ్గరగా ఉన్నటువంటి ఆదివాని గూడ లైన తుంగగూడెం, ఇప్పల గూడెం, రేగుల గూడెం, గట్టురావు పల్లి, గోండుగుడా, సాలెగూడ, సోనాపూర్, బడి గూడా, నాయకపు గూడా, దొడ్డి గూడా గిరిజన గ్రామాల ఆదివాసీ స్థానిక పేదలకు, వృద్ధులకు చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో వారికి 420 దుప్పట్లను దేవాపూర్ ఎస్ఐ విజయేందర్ పంపిణీ చేశారు. ప్రజల రక్షణ కోసం, భద్రత, వారి అవసరాలను చట్టపరిధిలో పరిష్కారం చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ పోలీసులు అందుబాటులో ఉంటారని ఎస్ఐ తెలిపారు.

తెలంగాణలో ఒమిక్రాన్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణలో కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ వ్యాప్తి చెందుతోన్న వేళ దీనిపై ఆందోళన నెలకొంది. దీనిపై ఈ రోజు హైకోర్టులోనూ వాదనలు జరిగాయి. తెలంగాణలో కరోనా పరిస్థితులపై రాష్ట్ర హైకోర్టు ఈ రోజు విచారణ జరిపింది. నూతన సంవత్సర వేడుకల వేళ రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని లాయర్లు వాదించారు. పబ్బులు, బార్లలో వేడుకలకు సమయాన్ని మరింత పెంచారరని లాయర్లు హైకోర్టుకు చెప్పారు. ఢిల్లీ, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ ఆంక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు.

అయితే, అందుకు హైకోర్టు నిరాకరించింది. నూతన సంవత్సర వేడుకల విషయంలో జోక్యం చేసుకోలేమని చెప్పింది. పరిస్థితులను బట్టి రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకుంటాయని హైకోర్టు వివరించింది. వేడుకలపై ఇప్పటికే పోలీసులు మార్గదర్శకాలు జారీచేశారని గుర్తు చేసింది. తెలంగాణలో మొదటి డోసు వంద శాతం పూర్తయిందని న్యాయస్థానం చెప్పింది. అయితే, కరోనాపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు అమలు చేయాలని రాష్ట్ర సర్కారుకు సూచించింది. కరోనా మార్గదర్శకాలు ఉల్లంఘించిన వారిపై తమకు వివరాలు తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఈ కేసును ఈ నెల 4కు వాయిదా వేసింది.

జనవరి 8 న మెదక్ జిల్లా ప్రజా పరిషద్ సాధారణ సర్వ సభ్య సమావేశం

మెదక్, డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి)జిల్లా ప్రజా పరిషద్ సాధారణ సర్వ సభ్య సమావేశం జనవరి 8 న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ లోని ఆడిటోరియం లో జెడ్.పి . చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహింపబడుతుందని జిల్లా పరిషద్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శైలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశనానికి రాష్ట్ర, ఆర్థిక, వైద్య శాఖామాత్యులతో పాటు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, డి.సి.సి.బి. చైర్మన్, జిల్లా జీర్ణధాలయా సంస్థ అధ్యక్షలు, డి.సి.ఏం.ఎస్. చైర్మన్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, కో ఆప్టెడ్ సభ్యులు, మండల అధ్యక్షులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కావున సంబంధిత అధికారులు సకాలంలో సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

ఏపీలో కొత్తగా 166 మందికి పాజిటివ్

అమరావతి, డిసెంబర్ 31: ఏపీలో గడచిన 24 గంటల్లో 31,844 కరోనా శాంపిల్స్ పరీక్షించగా 166 మందికి పాజిటివ్ అని నిర్ధారణ అయింది. అత్యధికంగా విశాఖ జిల్లాలో 31 కొత్త కేసులు నమోదు కాగా? చిత్తూరు జిల్లాలో 28, కృష్ణా జిల్లాలో 21 కేసులు వెల్లడయ్యాయి. అత్యల్పంగా కడప జిల్లాలో 3, శ్రీకాకుళం జిల్లాలో 3 కేసులు గుర్తించారు.

అదే సమయంలో 91 మంది కరోనా నుంచి కోలుకోగా, ఇద్దరు మరణించారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 20,77,145 పాజిటివ్ కేసులు నమోదు కాగా? 20,61,496 మంది ఆరోగ్యవంతులయ్యారు. ఇంకా 1,154 మంది చికిత్స పొందుతున్నారు. కరోనాతో మరణించిన వారి సంఖ్య 14,495కి పెరిగింది.

మెదక్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..!-జిల్లా కలెక్టర్ ఎస్ హరీష్.

మెదక్ డిసెంబర్ 31 (నేటినిజం ప్రతినిధి) నూతన సంవత్సరంలో మెదక్ జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని జిల్లా కలెక్టర్ ఎస్ హరీష్ అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం ?2022లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశలు, ఆశయాలతో ముందుకెళ్ళాలని కోరారు. గత సంవత్సరం కరోనా మహమ్మారితో అనేక ఇబ్బందులు పడ్డామని అలాంటి సమస్యలన్నింటి నుంచి తేరుకొని అందరికీ మంచి జరగాలని కోరుతూ నూతన సంవత్సరానికి స్వాగతించాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను సంయమనంతో జరుపుకోవాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి

మెదక్ డిసెంబర్ 31(నేటినిజం ప్రతినిధి) మెదక్ ప్రజలందరికీ సిఎం కేసిఆర్ రాజకీయ కార్యదర్శి, ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి గారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2022 అభివృద్ధి, ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి గారు ఆకాంక్షించారు. ఈ సంవత్సరం మెదక్ ప్రజల జీవితాల్లో, రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో మంచి మార్పులకు దారి తీయాలని ఆయన కోరుకున్నారు. ఈ నూతన సంవత్సరం లో కరోన వేరియంట్ లు డెల్టా, ఒమిక్రాన్ ల పీడ విరగడవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్టు ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి గారు పేర్కొన్నారు. ఈ రాబోవు నూతన సంవత్సరంలో మెదక్ జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు పయనించే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డి గారు పిలుపునిచ్చారు.

భారీగా తగ్గిన వంట నూనెల ధరలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: సామాన్యులకు ఊరటనిచ్చే న్యూస్ ఇది. ప్రధాన కంపెనీలు వంటనూనె ఉత్పత్తుల ధరలను తగ్గించాయి. ఎమ్ఆర్?పీపై రూ. 30-40 తగ్గించినట్లు స్పష్టం చేశాయి. ఈ విషయాన్ని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈఏ) ఓ ప్రకటనలో వెల్లడించింది రుచి సోయా(మహాకోష్, సన్‌రిచ్, రుచి గోల్డ్, న్యూట్రెల్లా బ్రాండ్స్), అదానీ విల్‌మార్ (ఫార్చ్యూన్ బ్రాండ్), ఇమామి(హెల్తీ అండ్ టెస్టీ బ్రాండ్స్), జెమిని(ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ బ్రాండ్స్), బంగే(డాల్డా, గగన్, ఛంబల్ బ్రాండ్స్), సీఓఎఫ్‌సీఓ (న్యూట్రిలైవ్ బ్రాండ్‌లు), ఫ్రిగోరిఫికో అల్లానా (సన్నీ బ్రాండ్‌లు), గోకుల్ ఆగ్రో (విటాలైఫ్, మహేక్, జైకా బ్రాండ్‌లు)తో పాటు ఇతర బ్రాండ్‌లు కూడా ధరలు తగ్గించాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

ఇటీవల కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సుధాన్షు పాండే.. ప్రధాన కంపెనీల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. వంట నూనెల ధరల తగ్గింపే ఎజెండాగా ఈ సమావేశం జరిగింది. ఆ తర్వాత వంటనూనెల ధరలను తగ్గిస్తున్నట్లు ఆయా కంపెనీలు ఇటీవలే అనౌన్స్ చేశాయి. వంట నూనెల ఉత్పత్తులపై దిగుమతి పన్ను భారాన్ని మోదీ సర్కార్ ఇటీవల తగ్గించింది. రిఫైన్డ్ పామాయిల్‌పై కస్టమ్స్ డ్యూటీని 17.5 శాతం నుంచి 12.5 శాతానికి సవరించింది. డిసెంబర్ 2022 వరకు లైసెన్స్ లేకుండానే రిఫైన్డ్ పామాయిల్‌ను దిగుమతి చేసుకోవడానికి వ్యాపారులకు పర్మిషన్ ఇచ్చింది.

ఏపీలో కొత్తగా 166 మందికి పాజిటివ్

అమరావతి, డిసెంబర్ 31: ఏపీలో గడచిన 24 గంటల్లో 31,844 కరోనా శాంపిల్స్ పరీక్షించగా 166 మందికి పాజిటివ్ అని నిర్ధారణ అయింది. అత్యధికంగా విశాఖ జిల్లాలో 31 కొత్త కేసులు నమోదు కాగా చిత్తూరు జిల్లాలో 28, కృష్ణా జిల్లాలో 21 కేసులు వెల్లడయ్యాయి. అత్యల్పంగా కడప జిల్లాలో 3, శ్రీకాకుళం జిల్లాలో 3 కేసులు గుర్తించారు.

అదే సమయంలో 91 మంది కరోనా నుంచి కోలుకోగా, ఇద్దరు మరణించారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 20,77,145 పాజిటివ్ కేసులు నమోదు కాగా 20,61,496 మంది ఆరోగ్యవంతులయ్యారు. ఇంకా 1,154 మంది చికిత్స పొందుతున్నారు. కరోనాతో మరణించిన వారి సంఖ్య 14,495కి పెరిగింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.